# మలశైల శిఖరాలు

గిడుగు రాజేశ్వర రావు

రెండు రోడ్లను తాకుతూ విశాలమైన ఆవరణ. అందులో ఒక ఆఫీసు. విరామ సమయం కాగానే అందులోని ఉద్యోగులంతా బిల బిలమని బయట పడతారు. టీలూ, కాఫీలూ ముగించుకొని చిన్న చిన్న గుంపులుగా, జట్లుగా విడిపోతారు. చెట్ల నీడలోనో, పోర్టికోల కిందనో, రీడింగ్ రూమ్‌లోనో, రిక్రియేషన్ క్లబ్బులోనో సర్దుకుపోతారు. ఎక్కడ చూసినా చైతన్యం. ఈ దృశ్యానికి నేపథ్య సంగీతంలా "ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి" అని స్లోగన్లు వినిపిస్తూ ఉంటాయి. కొందరు రాజకీయాలూ, కొందరు సినీమాలూ, గుర్రపు పందాలూ, ఇంకొందరు క్రీడారంగ విశేషాలూ గట్టిగా చర్చిస్తూ ఉంటారు. రీడింగ్ రూమ్‌లో తాజా వార్తాపత్రికలు విడదీసి పంచుకుంటూ ఉంటారు మరి కొందరు. నలుగురైదుగురు మాత్రం క్లబ్బులో ఉన్న సోఫాలలో పడి ఒక అరగంట నిశ్చింతగా నిద్ర తీస్తూ ఉంటారు. కేవలం కులమో, మతమో ఆధారంగా కూడిన గుంపులు అక్కడక్కడ కనుపిస్తాయి. అలాగని, స్నేహమే ప్రధానంగా కూడిన జంటలూ, గుంపులూ లేకపోలేదు. అలాంటి జంటల్లో రామం-నాగన్నల జట్టుకు సీనియారిటీ ఎక్కువ. సైకిల్ స్టాండ్ వెనక నీడలో ఒక రాతిమీద కూర్చుని ఏదో నెమ్మదిగా మాట్లాడుకుంటూ ఉంటారు.

ఉన్నట్టుండి ఒక చిన్న సంఘటన ఈ గుంపులకూ, జట్లకూ గండి కొట్టింది. మొదటి రోజు చాలా మంది ఉద్యోగులు ఒక ప్రవాహంలా కదిలివెళ్ళి ఆఫీసు ప్రధానాధికారిని కలిశారు. 'ఒక విభాగంలో అధికారిని మందలించాలి' అన్నారు. క్షమాపణ అడిగి శిక్షించాలని ఒత్తిడి చేశారు. రెండవ రోజు ఈ ప్రదర్శనకు తీసిపోనట్టు ఇంకో ప్రవాహం అదే ప్రధానాధికారిని కలిసింది. అసిస్టెంట్ కూడా తొందరపాటుతనం, దురుసుతనం చూపించక పోలేదనీ, అందుచేత విభాగం అధికారిని శిక్షించడం న్యాయం కాదనీ ఒత్తిడి చేశారు ఉద్యోగులు.

ఒక విభాగంలోని అధికారి అతని అసిస్టెంట్‌ను అవమానకరమైన భాషలో దూషించాడని తెలియవచ్చింది. ఇదే అలజడికి మూలకారణం. ఇలాటిది గతంలో జరగకపోలేదు. ఇంతవరకూ ఎందుకూ, అసిస్టెంటే ఆవేశంతో అధికారిని నానా మాటలూ అనడం కూడా కొత్త కాదు. కానీ ఈమారు ఇద్దరూ వేరే కులాలకు చెందడంతో, ఈ సంఘటనను వేరే కోణంలో చూశారు కొందరు. రెండు, మూడు రోజులు పాటు ఈ ప్రవాహాలలో ఏదో ఒక దానిలో పడిపోక తప్పదా అన్న విషమ సమస్య ఎదురైంది ఉద్యోగులకు. విరామ సమయంలో రోజూ ఉండే చైతన్యం, వైవిధ్యం కళ తప్పి, ఆఫీసు ఆవరణ గంభీరముద్ర వేసుకుంది. ఈ పరిణామం కొందరిని ఆశ్చర్యపరిచింది, కొందరిని ఉత్సాహపరిచింది మరి కొందరికి విచారం కలిగించింది. పెద్దల విజ్ఞతతో ఈ జ్వరం తగ్గి మామూలు పరిస్థితి నెలకొనడానికి నాలుగు రోజులు పట్టింది. అయితే ఈ ఉప్పెనల తాకిడి లేకుండా సైకిల్ స్టాండ్ వెనక మాట్లాడుకొంటున్న రామం-నాగన్నల ధోరణి అర్థంకాని చిక్కు ప్రశ్నలా చాలామందికి తోచింది. గతంలో వీళ్ళిద్దరూ విచిత్ర పరిస్థితుల్లో కలుసుకోవడం, తమ అనుభవాలు ఏరుకుని స్నేహదామన్ని గుచ్చుకోవడం ఎందరికి తెలుసు?

** ** **

వారం రోజుల నుంచీ ఇంటివాడు బాడుగ పెంచక తప్పదని ఒకటే నస పెడుతున్నాడు. రామానికి ఆఫీసులో అందిన వార్త విన్నాక కాళ్ళు కాల్తున్న వాడికి, మండుటెండలో చల్లని చెట్టునీడ దొరికినట్లయింది. నాగార్జునసాగర్ వెళ్తే రెంట్ లేకుండా వసతి ఇస్తారనీ, ఏదో ఎలవెన్స్ కూడా అదనంగా ఇస్తారనీ తెలిసింది. భార్య నిర్మలనూ, ఏడాది పిల్ల హైమనూ, ముసలి తల్లినీ తీసుకుని కాందిశీకుడిలా సిటీ వదిలి విజయపురికి పారిపోయాడు. హైస్కూల్ ఎదురుగా ఉన్న బ్లాక్‌లో ఒక క్వార్టర్స్ ఖాళీగా ఉందనీ, దాన్ని చూసుకుని వస్తే ఇస్తామనీ అన్నారు. కొళాయిలో నీరు ధారాళంగా వస్తోంది. ఒక ఫాన్ ఉంది. ఇతరత్రా సదుపాయంగా ఉంది. ఆ క్వార్టర్స్‌ని ఆనుకుని ఉన్న ఇంకొక క్వార్టర్స్‌లో ఎవరో ఇదివరకునుంచీ ఉంటున్నారు. ఈ బ్లాక్‌లో ఎవరో కంట్రాక్టరు బంధువులు ఉన్నప్పుడు, గతంలో రెండు వీధి గడపలనూ కలుపుతూ సిమ్మెంటుతో చప్టా వేశారు. ముళ్ళున్న ఇనప తీగలు ఫెన్స్‌లా వేశారు రెండు క్వార్టర్స్‌కీ చుట్టూతా.

రామం స్థిమితపడ్డాడు విజయపురిలో. బాడుగే లేకుంటే, బాడుగ పెంచే సమస్య ఇంకెక్కడిది? రెండు, మూడు రోజులు గడిచినా పొరుగున ఉన్నది ఎవరో—ఎలా ఉంటారో తెలియరాలేదు. 'మీరు ఎక్కడి నుంచి వచ్చారు? ఏమైనా సహాయం కావాలా' అని రామాన్ని అడగనూ లేదు. పరిచయం చేసుకుందుకు అవకాశం కూడా కలగనివ్వలేదు. ఒక ఉదయం వీధి గడపమీద రెండేళ్ళ పాప ఆడుకుంటూ ఉంటే నిర్మల చూసింది. నల్లనిచాయ, గుండ్రని నవ్వు ముఖం, కళ్ళలో మెరిసే కాంతీ, చక్కగా ఉంది.

"నీ పేరేంటమ్మా?" అని నిర్మల అడిగి ముచ్చట పడింది.

లోపలినుంచి "నీలమ్మా!" అన్న పిలుపు

## మండని సూర్యుడు

ఆలోచనా భారంతో
అడుగులు తడబడుతున్న
ఆది శేషయ్య అసంకల్పితంగా
అనువు కానిచోట ఆగిపోయాడు.
అవని భారాన్ని మోస్తున్న
ఆ ఆదిశేషుని పేరు
అందమైన చందమామలోని
అగుపించని మచ్చలాగా
అతని అంతరంగంలో
ఆరని చిచ్చు పెంచుతోంది.
అంబరాని కెత్తిన వాళ్ళే
అథఃపాతాళానికి నెడుతుంటె
అలసిన నేత్రాల నుంచి
అగ్నిహోత్రాలు పుడుతుంటె
అవమాన భారం
ఆలోచనల్ని మింగేసింది.
ఆకలిదప్పులు మరచి
అహోరాత్రులు శ్రమించినా
అవమానం తప్ప
అసలు లోపం ఎక్కడుందో
అవగతం కాలేదు.
అమని వచ్చిందని
ఆనందాతిశయంతో
ఆ వెన్నెల రాత్రి
ఆశతో అభిమానంతో
అర్థాంగి పొందు కోరితే
అమృతానికి బదులు అగ్నివర్షం
ఆత్మీయతకు బదులు అహంకారం
అనురాగం స్థానంలో
అవహేళన.
అనంతంగా ప్రకాశిస్తున్న
ఆదిత్యుడు
ఆ ఘాతుకం చూడలేక
అర నిమిషం సేపు అలా
అచేతనంగా ఉండిపోయాడు.

—జోస్యుల నాగభూషణరావు

విని—ఆ పాప తుర్రున లోనికి పోయింది.


మరునాడు ఉదయం ఆఫీసుకు పోతున్న రామాన్ని చేతితో సౌజ్ఞ చేస్తూ ఉండమన్నాడు ఎవరో నడివయస్కుడు. నోట్లో కారా కిళ్ళీ మాట్లాడడానికి వీలు కల్పించడంలేదు. కింద ఉమ్మితే తెల్లని పంచెమీద తుంపరలు పడే అవకాశం ఉందని జాగ్రత్తగా వెల్ల వేసిన హాస్పటల్ గోడమీద తుపుక్కున ఉమ్మి మాట్లాడే వీలు చేసుకున్నాడు.

'నేను స్పెషల్ కలెక్టర్ ఆఫీసులో పని చేస్తున్న రంగనాథాన్ని. మీరేనా బి. 771లోకి కొత్తగా వచ్చారు? మనలాంటి వాళ్ళు ఆ పొరుగున ఉండలేం సుమండీ! అందుకే క్రిందటి నెల ఖాళీ చేసి ఇక్కడికి మార్పించుకున్నాను" అన్నాడు వింతగా నవ్వుతూ.

ఆఫీసుకి టైము అవడంతో మాటలు పెంచకుండా హడావుడిగా వెళ్ళిపోయాడు రామం. ఏమాత్రం పాత పరిచయం లేకుండానే 'మనం' అనడం, తెల్లని గోడమీద నిస్సంకోచంగా కారా కిళ్ళీ నమిలి ఉమ్మడం అతనికి ఏవగింపు కలిగించాయి.

మధ్యాహ్నం ఏదో పనిమీద అడ్మినిస్ట్రేషన్ సెక్షన్‌కి వెళ్ళిన రామానికి, అతని పక్కన క్వార్టర్స్‌లో ఉంటున్నది నాగన్న అనీ, అతను కూడా హైదరాబాద్‌లో రామం వాళ్ళ ఆఫీసునుంచే ఒక సంవత్సరం కిందట సాగర్‌కి వచ్చాడనీ తెలిసింది. రామం చేరిన నెలలోనే నాగన్న కూడా సర్వీసులో చేరాడు. కానీ ఏదో వేరే సెక్షన్‌లో పని చెయ్యడం వల్ల పరిచయం కలగలేదు. మనిషి మితభాషి, చాలా మంచివాడు అని చెప్పారు తోటి ఉద్యోగులు. రంగనాథం నీడలోనే ఆ క్వార్టర్స్‌లో దిగిన వాళ్ళంతా నడుస్తారని సూత్రీకరించి ఆ భయంతో, ముభావంగా ఉన్నారేమో 'పొరుగువాళ్ళు'—అని మనసులో అనుకున్నాడు రామం.

సాయంత్రం ఇంట్లో ఎవరో కొత్తవాళ్ళు ఉన్న



అలికిడి అయింది. తలకు కట్టుకట్టి ఉన్న పాపను ఎత్తుకుని, నిర్మలతో ఆమె ఎవరో మాట్లాడుతోంది. రామం రావడంతో "పని చూసుకోండి, నే వస్తా" అంటూ వెళ్ళిపోయింది.

ఆమె పక్కింటి నాగన్నగారి భార్య వెంకటమ్మ అనీ, వాళ్ళ పాపకు మధ్యాహ్నం రెండు గంటల వేళ దెబ్బ తగిలిందనీ నిర్మల నెమ్మదిగా రామంతో వివరంగా చెప్పింది. నీలమ్మ వీధి గేటు దగ్గర ఆడుకుంటూ పడింది. ఇనపచువ్వ కంటికి కాస్తంత పైన లోతుగా గుచ్చుకుని రక్తం బొట బొట కారింది. నిర్మల పరుగున వెళ్ళి కొంగుతో గాయాన్ని అదిమి దగ్గరలోనే ఉన్న హాస్పటల్‌కు తీసుకు వెళ్ళింది. పెరట్లో పనిలో ఉన్న వెంకటమ్మ పరుగున వచ్చి రక్తాన్ని చూసి కళ్ళ నీళ్ళతో నిర్మల వెంట వెళ్ళింది. రెండు కుట్లు వేసి, డ్రెస్సింగ్ చేసి, ఇంజక్షన్ ఇచ్చి పంపించారు.

కొన్నాళ్ళకు గాయం మాని నీలమ్మ నుదుట చిన్న మచ్చ మిగిలిపోయింది. దెబ్బ తగలడం దురదృష్టకరమే! కానీ ఈ సంఘటన రెండు కుటుంబాలనూ చాలా దగ్గరగా తీసుకు వచ్చింది. నీలమ్మకే ఒక విధంగా మేలు చేసింది. పిల్లలు ఆడుతూ పాడుతూ ఆరోగ్యంగా పెరగాలంటే వాళ్ళ తోటి వయసు పాపలతో మెలిగే అవకాశం ఉండాలి. లేకుంటే అమ్మ కొంగో, అమ్మమ్మ, నాయనమ్మల కొంగో పట్టుకుని వేళ్ళాడడం, మారాం చెయ్యడం అలవాటై వయసుకు మించిన మాటలూ, చేతలూ అలవాటు చేసుకుంటారు.

గతంలో నీలమ్మ బొమ్మలు పేర్చుకుని ఆడుకుంటూ ఆటలో పక్కనున్న రంగనాథం ఇంటి అరుగుమీదకు పోయింది. రంగనాథం భార్య కసురుకుని, నీలమ్మ లేచి వచ్చిన వెంటనే బిందెడు నీళ్ళు పోసి అరుగంతా కడుక్కుంది. ఇది చూసిన వెంకటమ్మ మనసులో బాధ పడింది. రంగనాథం ప్రవర్తన కూడా పొరుగు వాళ్ళను అడుగడుగునా కించపరచే విధంగా ఉండేది. ఈ కారణంగా వెంకటమ్మ నీలను బయటకు పోనీకుండా కట్టడి చేసేది. అలా బందీ అయిపోయిన నీలకు ఇప్పుడు ఎంతో స్వేచ్ఛ కలిగింది. "అత్తా అత్తా" అంటూ నిర్మల దగ్గరి కెళ్ళి హైమతో ఆడుతుంది. ఎప్పుడైనా హైమ ఏడిస్తే, తా నెంతో పెద్ద దయినట్లు బొమ్మలు తెచ్చి చేతికిచ్చి ఊరడిస్తుంది. ఈ వేడుక చూసి వెంకటమ్మా, నిర్మలా నవ్వుకుంటారు. రామం తల్లి వీళ్ళతో పాటు ఆనందిస్తుంది. సాయంత్రం వరకూ ఆ ఇంటి ముందు స్కూలు పిల్లల సందడి. తరువాత ప్రశాంతంగా ఉన్న స్కూలు ఆవరణలో సిమ్మెంటుతో కట్టిన స్టేజి మీద గాలి మేస్తూ రామం, నాగన్నా విశ్రాంతిగా ఏదో మాట్లాడుకుంటారు. మొదట్లో కొన్ని కొన్ని విషయాలు చర్చించాలంటే ఇద్దరికీ సంకోచంగా ఉండేది. కులం, మతం, సంప్రదాయం—ఇలాటి విషయాల మీద మాట్లాడుకుంటూ ఒక సున్నితమైన గిరి గీసుకుని ఇద్దరూ ఆగిపోయేవారు—ఎవరిని ఎవరు మాటసికంగా బాధ పెట్టవలసి వస్తుందో అని. ఒక మంచుతెర ఇద్దరి మధ్యా నిలిచినట్లు ఉండేది. రాను రానూ పెరిగిన స్నేహంలోని వెచ్చదనంతో ఆ మంచు కరిగి, ధారాళంగా మాట్లాడుకునేవారు. హైమా నీలా అడుగులు వెయ్యడమే కాదు, పరుగులు తియ్యడం నేర్చుకున్నాక తల్లులకు దగ్గరగా ఆడుకోవడం మాని స్కూలు ఆవరణలో దోబుచులాడుకుంటూ గడిపేవారు సాయంకాలం. సిటీలో పరుగుపందెం లాంటి జీవితం కంటే సాగర్‌లో ప్రశాంతంగా, తీరికగా రోజులు సాగడంవల్ల రామం, నాగన్నా కలిసి చదువుకుని హైదరాబాద్‌లో వారం రోజులు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాసి వచ్చారు. కొన్ని నెలల తరువాత ఆ పరీక్షలో ఇద్దరూ పాసయినట్లు తెలిసిన రోజున రెండు కుటుంబాలూ ఒక్కటిగా సంతోషించాయి. ఇక ఇద్దరికీ ఆట విడుపులా తోచింది. పిల్ల లిద్దరూ చదువుకుంటూ ఉంటే, నాగన్నో, రామమో చదువు చెప్పడం, తెలియనివి నేర్పడం చేసేవారు. మిగిలిన వేళల్లో నవలలూ, వ్యాసాలూ తెచ్చి చదువుకోవడం, ఏదో విషయం పట్టుకుని జోరుగా చర్చ కొనసాగించడం జరిగేవి.

ఒక సాయంత్రం "వేదాలూ, ఉపనిషత్తులూ, పురాణాలూ వీటిమీద మీ అభిప్రాయం ఏమి"టన్నాడు నాగన్న.

"అవి అన్నీ కల్పనలని తీసిపారేసే వాళ్ళూ ఉన్నారు. అందులో వన్నీ యథాతథంగా జరిగాయని నమ్మినవాళ్ళూ ఉన్నారు. వాళ్ళ విషయం వదిలి నా వ్యక్తిగతమైన అభిప్రాయం చెప్తా" అన్నాడు రామం.

"నే నడిగింది మీ అభిప్రాయమే" అన్నాడు నాగన్న నవ్వుతూ.

నాగన్న మితభాషి. హాస్యప్రియుడు.

"మూగ సౌజ్ఞల స్థాయి నుంచి ఎదిగి, మనిషి ఒక భావను రూపొందించుకుని మాట్లాడడానికి చాలా కాలం పట్టి ఉంటుంది. ఆ భావకు సరిపడ్డ లిపిని ఏర్పాటు చేసుకునే స్థాయికి ఎదగడానికి ఇంకాస్త కాలం పట్టి ఉంటుంది. ఈ నడుమ కాలంలో సమాజమూ, దాని చరిత్రా స్తంభించిపోలేదు కదా! అదంతా తరతరాలకు జ్ఞాపకాల రూపంలో అంది గ్రంథస్థమై ఉండి ఉంటుంది. అందుకే ఆనాటి చరిత్ర జరిగింది జరిగినట్టు దొరకడం అసంభవం. ఇద్దరు చూసిన ఒకే సంఘటన ఇద్దరూ కాస్తంత తేడాగా వర్ణించి చెప్పడం జరుగుతుంది. అందుకే ఉపనిషత్తులూ, పురాణాలూ బహుదూరపు సాంఘిక చరిత్రగా తీసుకుని ఉత్ప్రేక్షలు వదిలి చదువుకోక తప్పదు. అవి మనకొద్దు అనుకుంటే ప్రాచీన కాలానికి చరిత్ర దొరకడమే కష్టం" అన్నాడు రామం.

"అంటే ఎలా చదవాలంటారు?" అన్నాడు నాగన్న.


"భీముడు చెట్లు పెరికి రాక్షసులను చంపాడు అంటే చాలా బలమైన వాడని అనుకోవాలి. బలరాముడు నాగలి ఆయుధంగా ధరించాడంటే ఆ యాదవరాజు వ్యావసాయక రంగంలో ఏవో కొత్త మెలకువలు సాధించి అభివృద్ధికి కృషి చేసి ఉండవచ్చు అనుకోవాలి" అన్నాడు రామం జవాబుగా.

"ఏకలవ్యుణ్ణి గురు దక్షిణగా బొటనవేలు ఇమ్మని ద్రోణుడు అడగడం కులవర్గ పక్షపాతం కాదంటారా?" అన్నాడు నాగన్న. "ఎందుకు కాదు? వాళ్ళూ మనుషులు కారా ఏమిటి? ద్వాపరం నాటికి కులం పేర కోటగోడలు కట్టుకున్నారు. కర్ణుణ్ణి కూడా తక్కువగా చూశారు.' ఛాందోగ్య ఉపనిషత్తులో సత్యకాముడు, గౌతముల ప్రస్తావన, సత్యకాముణ్ణి శిష్యుడుగా స్వీకరించడం చూస్తే ఆ కాలానికి కాస్త ముందు సమాజ స్వరూపం ఎంత సింపుల్‌గా ఉండేదో ఊహించవచ్చు కదా!

"బ్రహ్మ జ్ఞానానికి గౌతముడు ఇచ్చిన నిర్వచనం అర్థం చేసుకుంటే న్యూటన్, ఐన్‌స్టీన్‌లు కూడా బ్రాహ్మలే. కేవలం జందెం పోగు వేసుకున్న వాడు ఆ నిర్వచనంలోకి రాకపోవచ్చు. ఎంత మంచి ఒరవడి పెట్టుకున్నా, సంప్రదాయం ఏర్పరచుకున్నా నగటు మనిషిలో ఉండే స్వార్థానికీ, సామూహికంగా వచ్చే ఒత్తిడికీ కాలక్రమంగా ఆ సంప్రదాయం వక్రించక మానదు. ఆస్తి హక్కు ఇచ్చి రక్షణ కల్పించ పూనుకున్న వ్యవస్థల్లో ఈ స్వార్థం ఇంకా ఎక్కువ ఒత్తిడి తెస్తుంది.

ఒక ఏర్పాటులో సుఖంగా ఉన్న వర్గం ఆ ఏర్పాటు కొనసాగాలంటుంది. ఈ ధోరణి అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ కనుపిస్తూనే ఉంటుంది" అన్నాడు రామం.

"అబ్బా! చాలా పెద్ద ఉపన్యాసమే ఇవాళ" అన్నాడు నాగన్న తేలికగా నవ్వుతూ.



సరిగ్గా ఇదే రోజుల్లో కొత్తగా వచ్చిన ఇంగ్లీషు నవల ది మణ్ (మనిషి) ఎవరి దగ్గరనో ఉందని, ఇద్దరూ వెళ్ళి తెచ్చుకుని చదివారు. రామన్ని చర్చలోకి దించి ఆనందించడం నాగన్నకు ఒక వేడుక.

ఎప్పుడూ ఉత్సాహంగా ఉండే నాగన్న ఎందుకో గంభీరముద్ర వేసుక్కూర్చున్నాడు ఒక రోజు. హైదరాబాద్ వెళ్ళాడు పని ఉందని. తరువాత రామనికి తెలిసింది. నాగన్నకు ప్రమోషన్ వచ్చినట్లు హైదరాబాద్ నుంచి ఉత్తరం వచ్చిందనీ, కుల ప్రాతిపదికమీద లభించిన ప్రమోషన్ తనకు వద్దని తిరస్కరించబోయాడనీ, విపరీతమైన ఒత్తిడి వల్ల ఆ ప్రమోషన్ తీసుకోవడం జరిగిందనీ తెలిసిన రామనికి నాగన్న పట్ల గౌరవం పెరిగింది. అలాంటి పరిస్థితిలో నేనేం చేస్తా"నని రామం తనలో తాను వేసుకున్న ప్రశ్నకు స్పష్టమైన జవాబు రాలేదు. చిన్నతనంలో ఆరేళ్ళ ప్రాయంలో తనతో ఆడుకున్న సీనయ్య ఎందుకో ఈ సందర్భంలో గుర్తుకు వచ్చాడు.

సీనయ్య నల్లగా, సన్నగా ఉండేవాడు. నవ్వితే బుగ్గమీద చుక్కలా లొత్త పడేది. ఉంగరాల జుత్తు. గోళీకాయలు బాగా ఆడేవాడు. పగిలిపోయిన సోడాబుడ్లలోని గోళీకాయలు పోగుచేసి రామనికి ఎంతో ఆప్యాయంగా ఇచ్చేవాడు. ఇద్దరూ పోలీసు గ్రౌండ్స్‌లో ఆడుకునేవారు. ఒక సాయంత్రం బాగా దాహం వేసి ఇద్దరూ దగ్గరలో ఉన్న పెంకుటింటికి వెళ్ళి మంచినీళ్ళు కావాలన్నారు. ఆ ఇంటావిడ ఎవరో కానీ రామన్ని ప్లీడరుగారి అబ్బాయని గుర్తు పట్టింది.

"ఇంత దూరం వచ్చి ఆడుకుంటున్నావా?" అని గ్లాసుతో నీళ్ళు ఇచ్చింది.

"సీనయ్యకు కూడా నీళ్ళు కావాలి" అన్నాడు రామం.

"అలాగేలే ఇస్తాగా! నువ్వు తాగు" అందావిడ. రామం నీళ్ళు తాగాక, ఒక చెంబుతో నీళ్ళు తెప్పించి దూరంగా సీనయ్యను పిలిచి పోసింది. సీనయ్య అరచేతులు రెండూ దగ్గరగా కలిపి నీళ్ళు తాగాడు. మోచేతుల మీంచి నీళ్ళు కారి చొక్కా తడిసింది. రామని కెందుకో సిగ్గు వేసింది. నాలుగు రోజుల తరువాత ఆడుకుంటూ ఉంటే మళ్ళా దాహం అనిపించింది.

సీనయ్య అడిగాడు "దాహం వేస్తూంది కదూ?" అని. రామం అవునన్నట్టు తల ఊపేడు.

"నే నిక్కడే ఉంటాను. నువ్వు పోయి నీళ్ళు తాగిరా. ఆడుకుందాం" అన్నాడు సీనయ్య.

ఆ పెంకుటింటికి వెళ్ళడానికి రామనికి కూడా ఎందుకో ఇష్టం కలగలేదు.

"నేనూ పోను" అన్నాడు. ఇంకొంత సేపు ఆడుకున్నాక దాహం ఎక్కువైంది. "మా ఇంటికి వెళ్ళి నీళ్ళు తాగుదాం రా" అని పిలిచి తీసుకు వెళ్ళాడు.

అమ్మ కూడా సీనయ్యకు చెంబుతో నీళ్ళు పోస్తుందేమో అని మనసులో సందేహం వచ్చింది.

రామం తల్లి "ఎవర్రా ఈ కుర్రాడు?" అని అడిగింది.

"సీనయ్య. నాతో రోజూ ఆడుకుంటాడు. మాకు దాహంగా ఉంది. మంచినీళ్ళు కావాలి" అన్నాడు రామం. రెండు గ్లాసులతో నీళ్ళు తెచ్చి ఇస్తూ.

"ఈ సీనయ్యకి బుగ్గమీద లొత్త పడుతుందిరా—అదృష్టం" అంది రామం తల్లి.

రామం మనసులో ఒక అగ్నిపరీక్షలో నెగ్గినంత సంతోషం కలిగింది. 'అమ్మ ఎంత మంచిది' అనుకున్నాడు.

చిన్నపిల్లలకు ఆత్మగౌరవం—అవమానం ఇలాంటివి తెలియవని అనుకుంటాం. వాళ్ళకి ఆ పదాల ఆర్భాటం తెలియకపోవచ్చు కానీ, ఆ అనుభవాలు అతి సున్నితంగా గుచ్చి గాయం చేస్తాయి. సీనయ్యకు పెంకుటింట్లో తన ముందే అవమానం జరిగిందనీ—అందుకు తను కూడా బాధ్యుడు అని రామం మనసులో ఒక భావన చాలా కాలం ఉండిపోయింది.

ఒక ఏడాది తరువాత సాగర్ వదలి నాగన్న హైదరాబాద్‌లో ఇల్లు కట్టుకున్నాడు. రెండేళ్ళ తరువాత గానీ రామం హైదరాబాద్ తిరిగి రాలేదు. వచ్చాక అద్దె ఇల్లు దొరక్క అవస్థ పడుతూ ఉంటే నాగన్న "నా ఇంట్లో ఉండండి" అన్నాడు. ఇలా మళ్ళా కలసిన స్నేహం అవిచ్ఛిన్నంగా సాగింది.

నీలమ్మా, హైమా మెడిసిన్‌లో సీటు కోసం ఎంట్రెన్స్ పరీక్షకు శ్రద్ధగా కలిసి చదివారు. నాగన్నా, రామం ఇద్దరూ వాళ్ళకు తెలిసినవి చెప్తూ ప్రోత్సాహం ఇచ్చారు. సీటు నీలకు మాత్రమే వచ్చింది. ఈ సంఘటన రెండు కుటుంబాలనూ నిరుత్సాహపరిచింది.

నీలా, హైమా ముచ్చటగా మాట్లాడుకుంటూ, కలిసిమెలిసి పువ్వులు కోసుకుంటూ, పాడుకుంటూ కనిపించే దృశ్యానికి అలవాటు పడ్డ నాగన్నా, రామం మార్కులు వచ్చిన రోజున ఇద్దరినీ అలా చూడలేకపోయారు. 'గదిలో ఒక్కతే కూర్చుని ఏడుస్తున్న హైమను ఎలా మందలించాలి, ఎలా నీలతో ఎప్పటిలా కలిసి తిరిగేటట్టు చెయ్యాలి' అని ఆలోచనలో పడిపోయాడు రామం. కులశైల శిఖరాల నీడ పడకుండా హైమను పెంచి పెద్ద చెయ్యాలనీ, నాగన్నా తనూ చూడగలిగినట్టి జీవితాన్ని నీలా, హైమలు కూడా చూసేటట్టు ఆ ఇద్దర్నీ మలచాలనీ కలలు కన్న రామనికి హైమ వెక్కి వెక్కి ఏడవడం ఒక విధంగా సిగ్గనిపించింది. ఏం చెయ్యాలి? నాగన్న ఈమె ఏడ్పు వింటే ఎంత నొచ్చుకుంటాడు మనసులో అని బాధపడ్డాడు.

హైమ దగ్గరికి వెళ్ళి, తల నిమురుతూ ఊరడిస్తూ ఇలా అన్నాడు నెమ్మదిగా—"ఏ వ్యక్తికీ తన పుట్టుకమీద ఎలాంటి అధికారం ఇవ్వలేదమ్మా ఈ ప్రకృతి! ఫలానా ఇంట్లో పుట్టాలనీ, ఫలానా తల్లితండ్రులకు బిడ్డని కావాలనీ ఎవ్వరూ అనుకుని పుట్టరు. ఇదివరకే ఒక ఒరవడిలో రూపుదిద్దుకున్న సమాజంలో, వ్యవస్థలో పడ్డ వ్యక్తి, తల్లీ తండ్రీ తింటున్న ఆహారమే తిని, కులమో, మతమో ముద్రగా వేసుకుని, జీవిత విధానం అలవాటు చేసుకుని, ఈ సమాజం, ఈ వ్యవస్థ ఇచ్చిన న్యాయం స్వీకరించక తప్పదు! ఈ సూత్రానికి కట్టుపడకుండా నువ్వే కాదు, నేనే కాదు, నీల కూడా తప్పించుకోలేదు, నాగన్నగారు కూడా అంతే! జందెం ప్రస్తుతం ఒక కులానికీ, ఒక వర్గానికీ గుర్తింపు కార్డు మాత్రమే అని నేను వేసుకోపోయినా, నేను కళ్ళు మూసినప్పుడు నా కులస్థులంతా చేరి నామీద ఒక జందెం పోగు వడేసి దహనసంస్కారం చేసేస్తారు. అది అంతే! వీడు బ్రతికిన రోజుల్లో జందెం వేసుకుని ఎరగడు అని ఊరుకోరు. నువ్వే నీలవైతే ఏం చేస్తావు చెప్పు? పాపం నీల కూడా అంతే చెయ్యగలదు."

తన మనసులోని దంతా అనుకున్నట్లు చెప్పగలిగాడో లేదో కానీ హైమ మాత్రం లేచి కళ్ళు తుడుచుకుని నవ్వింది—చిన్నగా. మరునాడు సాయంత్రం పిట్టగోడ దగ్గర నిలబడి పువ్వులు కోసుకుంటున్న నీలనూ, హైమనూ చూసి తృప్తిపడి, 'పసిపిల్లల్లో అసూయకు కందని ప్రేమలు పూసే వ్యవస్థ రావా'లని అనుకుంటూ నిట్టూర్చేడు రామం. ●

